క్లుప్తంగా

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

రావులపాలెం: పొడగట్లపల్లికి చెందిన చిలకమర్తి మౌనిక స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతుంది. తండ్రి మరణించడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మౌనికకు స్థానిక వాసవీ క్లబ్ అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి ట్రస్ట్ ద్వారా రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.

రాష్ట్ర దేవాంగ సంఘ కార్యదర్శిగా జగదీష్

మామిడికుదురు: ఏపీ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యదర్శిగా మొగలికుదురుకు చెందిన కొండా జగదీష్ ఎన్నికయ్యారు. సంఘ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. సంఘ చేనేత విభాగం ఉపాధ్యక్షులుగా అదే గ్రామానికి చెందిన గుంటు వీరవెంకట సత్యనారాయణ, రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షునిగా కారుపర్తి షణ్ముక సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రేపు సాగునీరు విడుదల

కొత్తపేట: ప్రస్తుత రబీ పంటకు వంతుల వారీగా సాగునీటి సరఫరా విధానం అమలులో భాగంగా వాడపాలెం లాకుపై ఉన్న చానళ్లకు మంగళవారం సాగునీరు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ద్వారా వాడపాలెం లాకులపైన వాడపాలెం ఓల్డ్, న్యూ చానల్స్‌కు ఉదయం 6 నుంచి 24 గంటల పాటు సాగునీరు సరఫరా చేయనున్నట్టు చెప్పారు. కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల రైతులు సాగునీరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి బంధువుకు చెక్కు అందిస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.13 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాజోలు మండలం పొదలాడ గ్రామానికి చెందిన 30 ఏళ్ల కల్యాణం గౌరీప్రసాద్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో, కిడ్నీ మార్పిడి జరగాలని వైద్యులు తెలిపారు. అతడి తల్లి కిడ్నీ ఇవ్వడంతో నెల రోజుల క్రితం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. అనంతరం మూడు నెలల కాలంలో ఇన్ఫెక్షన్ రాకుండా చేసే ఇంజెక్షన్‌కు రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. దాతల సాయం, కొంత అప్పు చేసి రూ.5 లక్షల వరకు ఖర్చు పెట్టారు. సంస్థ సభ్యులు బాధితుడి మేనల్లుడు ఇంగువ నాగప్రసాద్‌కు చెక్కును అందజేశారు.

గల్ఫ్ యువ నేస్తం సేవలు భేష్



బాధితునికి సాయం అందిస్తున్న శివకుమార్, సభ్యులు

మలికిపురం: గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి సేవలు అభినందనీయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ అన్నారు. శంకరగుప్తం గ్రామానికి చెందిన కడలి పెద్దిరాజుకు వైద్యం కోసం సమితి సభ్యులు రూ.20 వేలు సమకూర్చారు. పాటి శివకుమార్ ఇచ్చిన రూ.1,500తో కలిపి బాధితునికి ఆదివారం గ్రామంలో అందించారు.

చెక్కుల అందజేత

మలికిపురం: సీఎం సహాయ నిధి కింద నియోజకవర్గానికి చెందిన 12 కుటుంబాలకు రూ.13.50 లక్షల విలువైన చెక్కులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం అందజేశారు. విశ్వేశ్వరాయపురంలోని తన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

సంకటహర చతుర్థి పూజలు

ఆలమూరు: పెదపళ్లలోని బాల గణపతి ఆలయంలో ఆదివారం ఘనంగా సంకటహర చతుర్థి పూజలు జరిగాయి. స్వామివారికి ప్రాతఃకాల విశేష అభిషేకాలు, అర్చనలు, గరిక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సంకటహర గణేష హోమం భక్తులను ఆకట్టుకుంది. ఆలమూరు, చింతలూరు, సంధిపూడి, పినపళ్ల తదితర విఘ్నేశ్వరుని ఆలయాల్లో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి.

నేటి నుంచి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐదు రోజుల పాటు శాస్త్రోక్తంగా ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 17న శేష వాహనం, 18న గరుడ వాహనం, 19న గజవాహనం, 20న హనుమత్ వాహనం, 21న కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంలో దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవాన్ని జరపనున్నారు. 22న జరిగే పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఒత్తిడిని జయిస్తే ‘పది’లమే..



మందపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు



బిళ్లకుర్రు కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతిలో చదువుతున్న విద్యార్థులు

- పరీక్షల వేళ ఆందోళన వద్దంటున్న నిపుణులు
- సమతుల ఆహారం, సమయానికి నిద్ర అవసరం

కొత్తపేట: పదో తరగతి పరీక్షలకు సమయం ఆసన్నమవుతోంది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. ఒత్తిడిని జయిస్తే పదిలమైన విజయం ఖాయమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి రోజు తమ దైనందిన కార్యక్రమాలతో పాటు, కొత సమయం యోగా, ప్రాణాయామం చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. రోజూ సమతుల్యమైన ఆహారం, సమయానికి నిద్ర, మానసిక, శారీరక ఆరోగ్యంపై తగినంత శ్రద్ధ వహిస్తే ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురికాకుండా ఉత్సాహంగా ఉండవచ్చు. ఆయా నియమాలు పాటిస్తే సునాయాసంగా పరీక్షలు రాయడమే కాక, ఉత్తమ ఫలితాలు సాధిస్తారని సూచిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 50 పరీక్షా కేంద్రాలు నిర్దేశించారు. మొత్తం 8,739 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు
కొత్తపేట	16	3,542
పి.గన్నవరం	19	3,083
రాజోలు	15	2,114
మొత్తం	50	8,739

ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలి



పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇప్పటికే విద్యార్థులకు సరైన ప్రణాళిక రూపకల్పన చేశాం. ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా ఆయా సబ్జెక్టులపై సందేహాలు నివృత్తి చేసేందుకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ఆందోళనతో విద్యార్థులు అర్ధరాత్రి వరకు చదవకుండా, సమయానికి భోజనం, నిద్ర ఉండే విధంగా తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఏ సబ్జెక్టులోనైనా సందేహాలు ఉంటే తక్షణమే ఉపాధ్యాయులను సంప్రదించాలి. పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకుంటే ఎటువంటి ఆందోళన ఉండదు. ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావచ్చు.

– మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

సరైన ఆహారం తీసుకోవాలి



పరీక్షల సమయంలో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు ఒత్తిడితో కూడిన అభ్యసన చేస్తారు. కొన్ని సందర్భాల్లో సరైన ఆహారం, నిద్ర లేకుండా చదువుతారు. ఈ ప్రభావంతో పరీక్ష కేంద్రంలో ఇబ్బందులు పడతారు. అటువంటి ఇబ్బందులు లేకుండా, రోజుకు ఆరు గంటల వరకు నిద్ర ఉండే విధంగా చూసుకోవాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు జంక్ ఫుడ్స్‌తో పాటు, అధిక కారం కలిగిన ఆహారం తీసుకోకుండా ఉంటే మంచిది. మంచినీరు అధికంగా తీసుకోవాలి. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఫైబర్ అధికంగా ఉండే విధంగా చూసుకోవాలి.

– డాక్టర్ మెంటే శ్రీధర్‌నాయుడు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, కొత్తపేట

యోగా, ప్రాణాయామంతో ఏకాగ్రత



పరీక్షలంటేనే విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు, దీన్ని అధిగమించేందుకు పిల్లలు రోజూ సూర్యోదయానికి మునుపు సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేయడం ఎంతో మంచిది. దీని వలన ఏకాగ్రత పెరగడమే కాకుండా చదివిన విషయాలు గుర్తుంటాయి. మానసిక స్థైర్యం ధృడంగా ఉంటుంది. అత్యధికంగా బలాన్నిచ్చే, సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం ఆరోగ్యకరం,

– ఏఎస్ఎస్ రమాదేవి, పీడీ, జెడ్పీ హైస్కూల్, మండపల్లి

ప్రణాళికతో చదువుతున్నాం



పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ఇప్పటికే మా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించారు. దానినే అనుసరిస్తున్నాం. ఎటువంటి ఆందోళన లేకుండా చదువుతున్నాం. ఒత్తిడిని జయించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. వాటిని విధిగా పాటిస్తున్నాం. పరీక్షలు బాగా రాసి, ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– వి.రోహిణి, పదో తరగతి విద్యార్థిని, జెడ్పీ హైస్కూల్, మండపల్లి

నూకాంబికా జాతరకు అంకురార్పణ



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న ఈఓ తదితరులు

ఆలమూరు: ప్రసిద్ధి చెందిన చింతలూరు నూకాంబికా అమ్మవారి తీర్థ, జాతర మహోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి పర్యవేక్షణలో మార్చి 28న ప్రారంభమయ్యే జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని అంకురార్పణ పూజలతో ఉత్సవాల ప్రక్రియను ప్రారంభించారు. అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా ఏటా ఒకటిన్నర నెలల ముందు విఘ్నేశ్వర పూజను చేసి అమ్మవారి ఉత్సవాలకు పనులు ప్రారంభించినట్లు ఈఓ తెలిపారు. మార్చి ఒకటి నుంచి 12 వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారు బుట్ట గరగ రూపంలో ప్రజలకు దర్శనమివ్వనున్నారు. 13 నుంచి 28 వరకూ ప్రతి రోజు రాత్రి మస్యం నుంచి తీసుకువచ్చిన మోదుకుపూలతో తయారు చేసిన గరగతో జాతరలను నిర్వహిస్తారు. మార్చి 28న పెద్ద జాగరణ, 29న తీర్థం, 30న ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, సాగునీటి సంఘం చైర్మన్ వైట్ల గంగరాజు, వైట్ల చినఅబ్బు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో ప్రశాంతత

అయినవిల్లి: భక్తులకు భగవద్గీత పఠనం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్ దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువు గ్రామంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

నగరం గ్రామాన్ని దత్తత తీసుకోవాలి



నగరంలో జీసీఎస్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

మామిడికుదురు: కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉన్న అపార చమురు, సహజ వాయువు నిక్షేపాలను ఓఎన్జీసీ, గెయిల్, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్, రిలయన్స్ సంస్థలు తరలించుకుపోతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం నగరం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చమురు సంస్థలు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నాయని దుయ్యబట్టారు. ఇక్కడి చమురు, ఖనిజాలు, సహజ వనరులపై లభించే ఆదాయంలో న్యాయమైన వాటా ఈ ప్రాంత ప్రజలకు దక్కాలన్నారు. 2014లో నగరంలో జరిగిన గ్యాస్ విస్ఫోటంలో 22 మంది మరణించడమే కాకుండా, ఈ ప్రాంతమంతా కాలిబూడిదైందన్నారు. రైతులకు, ప్రజలకు తీవ్రమైన నష్టం జరిగిందని, బాధితులకు పూర్తి న్యాయం జరగలేదన్నారు. నగరం గ్రామాన్ని దత్తత తీసుకుంటామని, వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తామని చమురు సంస్థ హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఆ హామీలు ఇంతవరకు నెరవేరలేదన్నారు. రైతుల పొలాల్లో వేసిన పైపులైన్లకు కౌలు కూడా ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులపై రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడాలని కోరుతూ ఈ నెల 23న కాకినాడ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు పెద్దఎత్తున బాధితులు, రైతులు తరలి రావాలని కోరారు. గ్యాస్, చమురు, సహజ వనరుల పరిరక్షణ కమిటీ నేత డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకర్, దేవ రాజేంద్రప్రసాద్, జాలెం సుబ్బారావు, నల్లి చిట్టిబాబు, పుల్లెల ఆనంద్, మొల్లేటి శ్రీనివాస్, నఖిలే శ్రీను పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అటకెక్కిన అభివృద్ధి, సంక్షేమం

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



ఆత్రేయపురంలో శ్రీనివాసరాజును పరామర్శిస్తున్న జగ్గిరెడ్డి తదితరులు

కొత్తపేట: అనేక హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం అటకెక్కాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిలువూరు రామకృష్ణంరాజు కుమారుడు శ్రీనివాసరాజును ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పడిన అనేక సమస్యలను పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దానిపై ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం మినహా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. త్వరలో గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుంటానని, ఆయా సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నామని, ప్రజల తరపున నిలబడి వారి సమస్యలపై పోరాటం చేయడం తన నైజమని జగ్గిరెడ్డి అన్నారు. పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ముదునూరి సూర్యనారాయణను పరామర్శించారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముదునూరి బండ కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ చిలువూరి నాగరాజు, పార్టీ నాయకులు కర్రి నాగిరెడ్డి, వేగేశ్న గోపాలం, సరెళ్ల పండు, వేగేశ్న గోపిరాజు, ఉద్దరాజు గాంధీరాజు తదితరులు పాల్గొన్నారు.

బొత్సను కలిసిన గన్నవరపు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న బొత్స సత్యనారాయణ

మామిడికుదురు: అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకుంటూ వైఎస్సార్ సీపీని ముందుకు నడిపించాలని పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అన్నారు. పార్టీ పి.గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆదివారం విశాఖపట్నంలోని సిరిపురంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన శ్రీనివాసరావును ఆయన శాలువాతో సత్కరించారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, అన్ని కులాలు, వర్గాలను సమన్వయం చేసుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లి, వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. పార్టీ అంబాజీపేట మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్, నేతలు కటకంశెట్టి ఆదిత్య, వాసంశెట్టి తాతాజీ తదితరులు ఉన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని ఆదివారం, సంకటహర చతుర్థి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహా నివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి, ఆలయ తలుపులు వేశారు. స్వామివారి పంచామృతాభిషేకాల్లో రెండు జంటలు పాల్గొన్నాయి. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 139 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 72 జంటలు, స్వామివారి గరిక పూజలో ఐదు జంటలు పాల్గొన్నాయి. స్వామివారికి రూ.4,22,563 ఆదాయం లభించినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

నిత్య కల్యాణం.. పచ్చతోరణం

- వాడపల్లి క్షేత్రానికి తరలివస్తున్న భక్తజనం
- అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు



వాడపల్లి క్షేత్రంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం నిత్య కల్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తోంది. అశేష భక్తజనం తరలిరావడంతో ఇది కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందింది. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా, మిగిలిన రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వాడపల్లి క్షేత్రానికి భక్తులు తరలివచ్చి, అష్టోత్తర పూజలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వరస్వామిని దేవదాయ, ధర్మాదాయ శాఖ జాయింట్ కమిషనర్, సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, పూజాదికాల అనంతరం వేదాశీర్వచనం, అనంతరం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ప్రతి శనివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కాకినాడ, అమలాపురం నాట్యాలయ బృందం వారు నిర్వహించిన ఉమా సోమేశ్వర కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా అలరించింది.



వాడపల్లి ఆలయంలో అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు



దేవదాయ శాఖ జేసీ త్రినాథరావుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అధికారులు, అర్చకులు

ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ స్వాతి

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట సత్యసాయి కల్యాణ మంటపంలో ఆదివారం ఉచిత వేరికోస్ వైద్య శిబిరం జరిగింది. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్లు స్వాతి, జీవీ ప్రవీణ్‌కుమార్ 203 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి, వారికి హైదరాబాద్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించాలన్న లక్ష్యంతోనే ఈ శిబిరం ఏర్పాటు చేశామని సేవా సంస్థల కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు తెలిపారు. ఈ శిబిరంలో సేవా సంస్థల ప్రతినిధులు ఎంపీ వర్ధనరావు, ఎ.కృష్ణ, డాక్టర్ కాశిన ప్రభాకర్ వాసవి బుజ్జి పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి రూ.1.02 లక్షల సామగ్రి అందజేత



సీహెచ్‌సీకి సామగ్రి అందిస్తున్న భీమాల

పి.గన్నవరం: అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి దాతల సహకారంతో ఆదివారం రూ.1.02 లక్షల విలువైన సామగ్రి అందజేశారు. రెండు స్టీలు కుర్చీలు, రెండు టీవీలు, 100 దుప్పట్లు, 10 ఫ్యాన్లు తదితర సామగ్రిని హెడ్ నర్సు జి.అనంత లక్ష్మీకుమారికి భీమాల అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు గూటం శ్రీనివాసరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కవులు, కళాకారుల ప్రోత్సాహానికి కృషి



ప్రతాప్‌ను సత్కరిస్తున్న కళాకారులు

సఖినేటిపల్లి: సమాజంలో కవులు, కళాకారుల ప్రోత్సాహానికి నిరంతరం కృషి చేస్తామని శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఆదివారం ఉయ్యూరు వారి మెరక కమ్యూనిటీ హాల్‌లో ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ పంచమ వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. కళావేదిక సీఈవో ప్రతాప్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాకారులు ప్రదర్శించిన భరత నాట్యం, కూచిపూడి, జానపదం, నాటిక, ఏకపాత్రాభినయం, మిమిక్రీ, రైతు పాత్ర, కవితలు, మాయల ఫకీర్ వంటివి సభికులను అలరించాయి. కళా కిరీటి పురస్కారాలతో కళాకారులు సీహెచ్ రామారావు, కడలి కృష్ణారావు, అల్లూరి జానకీరామరాజు, పిచ్చుక గంగాధర్‌రావు, వాకా రాంబాబు, మోరం నాయుడు, వీవీఎస్ సుబ్బారావును సత్కరించారు. సీఈవో ప్రతాప్‌ను అభినవ శ్రీకృష్ణదేవరాయ బిరుదుతో సత్కరించారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం



పాశర్లపూడి ఉత్తర బాడవలో వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: పాశర్లపూడి ఉత్తరబాడవలో ఉన్న వీరభద్రస్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణసంచా కాల్పులు నడుమ ప్రభ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. వైనతేయ గోదావరి నది వరకు గ్రామోత్సవం జరిగింది. పవిత్ర వైనతేయ గోదావరి నదీ స్నానం అనంతరం శమీపూజను వైభవోపేతంగా జరిపించారు. 72వ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 12 నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాశీభట్ల కామేశ్వర సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం వలవల ఈశ్వరరావు సారథ్యంలో 60 గజాల పొడవు కలిగిన నిప్పుల గుండాన్ని భక్తులు తొక్కారు. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు.

అయినవిల్లి: నేదునూరు గ్రామంలో భావన పెదకాపు ఇంటి వద్ద ఆదివారం వీరభద్రుని సంబరం ఘనంగా జరిపారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న జమ్మి చెట్ల వద్ద వీరభద్రునికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పువాయిద్యాల మధ్య వీరభద్రుని గ్రామోత్సవం జరిగింది. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

సత్తెమ్మ తల్లి జాతర

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామంలో సత్తెమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, కానుకలు, మొక్కుబడులు చెల్లించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కోలాటం, డప్పు వాయిద్యాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమ్మవారికి పూజలు చేశారు.